Digital, tmedia.net.in

# టీ-మీడియా

tmedia.net.in
సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక :336
పేజీలు : 5

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

సోమవారం ఆగస్టు 10, 2026 టీమీడియా మెయిన్ ఎడిషన్ ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

## ఆగస్టు నెల.. అన్నీ శుభవార్తలే

● సీఎం రేవంత్



**టి మీడియా ,ఆగస్టు 9 , హైదరాబాద్ బ్యూరో :** ఆగస్టు నెలను తెలంగాణ రాష్ట్ర సంక్షేమ మరియు అభివృద్ధి మాసంగా మారుస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా ఆగస్టు 15వ తేదీన ప్రజాపాలన పథకాల విస్తరణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. ఇందులో భాగంగా కొత్త పెన్షన్లు, నూతన రేషన్ కార్డుల పంపిణీతో పాటు మరో 5 లక్షల మంది లబ్ధిదారులకు రూ.500 సబ్సిడీ గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేయనున్నారు. అంతేకాకుండా 'గృహ జ్యోతి' పథకం కింద అదనంగా 4 లక్షల ఇళ్లకు ఉచిత విద్యుత్ అందించే కార్యక్రమాలను సీఎం ప్రారంభించనున్నారు. పేదలకు ఆర్థిక, సామాజిక భద్రత కల్పించడమే లక్ష్యంగా ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది

# ఆర్జీకర్ హత్యాచార ఘటనపై పునఃవిచారణ

## బంగాల్ ముఖ్యమంత్రి కీలక ప్రకటన



**టి మీడియా ,ఆగస్టు 9 ,కోల్‌కతా :** దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన ఆర్జీకర్ వైద్యురాలి హత్యాచార కేసులో బంగాల్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2024లో కోల్‌కతాలోని ఆర్జీకర్ మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్‌లో పీజీ వైద్య విద్యార్థినిపై జరిగిన అత్యాచారం, హత్య ఘటనపై పునఃవిచారణకు ఆదేశించినట్లు బంగాల్? ముఖ్యమంత్రి సువేందు అధికారి ప్రకటించారు. బాధితురాలి తల్లి విజ్ఞప్తి మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. బాధితురాలి తల్లి రత్న దేబ్‌నాథ్ తనకు లేఖ రాసి కేసును మరోసారి దర్యాప్తు చేయించాలని కోరినట్లు సువేందు అధికారి వెల్లడించారు. ప్రస్తుతం ఆమె బంగాల్?లో బీజేపీ ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆమె నుంచి వచ్చిన విజ్ఞప్తిపై చీఫ్ సెక్రటరీతో పాటు నిపుణుల బృందంతో సుదీర్ఘంగా చర్చించిన అనంతరం పునఃవిచారణకు నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.

### స్పెషల్ కమిషన్ చట్టం కింద దర్యాప్తు

1952 నాటి స్పెషల్ కమిషన్ చట్టం కింద తాజా దర్యాప్తు చేపట్టనున్నట్లు సువేందు అధికారి తెలిపారు. ఈ కేసులో పోలీసులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించడంలో విఫలమయ్యారని ఆయన ఆరోపించారు. కేసు దర్యాప్తులో ఏమైనా లోపాలు జరిగాయా? ఎవరి నిర్లక్ష్యం వల్ల అవి చోటుచేసుకున్నాయి? అనే అంశాలను తాజా విచారణలో పరిశీలించనున్నట్లు తెలిపారు. బాధితురాలి కుటుంబం, సహచర వైద్యులు మొదటి నుంచీ ఈ ఘటన వెనుక మరికొందరి ప్రమేయం ఉండొచ్చని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కేవలం ఒక వ్యక్తితోనే ఈ దారుణం జరిగిందా? లేక మరికొందరు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఇందులో భాగస్వాములయ్యారా? అనే కోణంలో దర్యాప్తు చేయాలని వారు డిమాండ్ చేస్తూ వస్తున్నారు.

### అంత్యక్రియలపై కూడా దర్యాప్తు

కేసు దర్యాప్తుతో పాటు బాధితురాలి అంత్యక్రియల సమయంలో జరిగినట్లు ఆరోపణలు వస్తున్న లోపాలపైనా ప్రత్యేకంగా విచారణ చేపట్టాలని ఆదేశించినట్లు సువేందు అధికారి తెలిపారు. అంత్యక్రియల ప్రక్రియలో నిబంధనలు ఉల్లంఘించారా? అధికారులు లేదా పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారా? అనే అంశాలను పరిశీలించాలని ఆదేశించారు. బాధ్యత వహించాల్సిన వ్యక్తులు ఎవరైనా ఉంటే వారిపై తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించినట్లు చెప్పారు.

### 2024 ఆగస్టు 9న వెలుగులోకి!

2024 ఆగస్టు 9న కోల్‌కతాలోని ఆర్జీకర్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో విధుల్లో ఉన్న పీజీ వైద్య విద్యార్థిని (మిగతా 2లో)

# ఆదివాసీల సమగ్ర అభివృద్ధే లక్ష్యం

● సీఎం చంద్రబాబు



**టి మీడియా ,ఆగస్టు 9 , అమరావతి బ్యూరో :** ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా గిరిజన సోదరసోదరీమణులందరికీ ముఖ్యమంత్రి చంద్రబాబు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. అడవితో, ప్రకృతితో ముడిపడి ఉన్న గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, వారి విశిష్టమైన జీవన విధానం మన సమాజానికి ఎంతో గర్వకారణమన్నారు. అందుకే ఆదివాసీల విద్య, ఆరోగ్యం, ఉపాధి రంగాలు మెరుగుపరిచి వారి సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. గిరిజనుల ఆత్మగౌరవాన్ని పెంపొందిస్తూ, వారి స్వయం సమృద్ధి, ప్రగతే ధ్యేయంగా ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తుందన్నారు.

### గిరిజన సంరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది:

అంతర్జాతీయ గిరిజన దినోత్సవం సందర్భంగా రాష్ట్ర గిరిజనులకు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. తరతరాలుగా అడవులను ఆవాసంగా చేసుకుని, వాటిని కాపాడుతున్న గిరిజనుల సంస్కృతిని అందరూ గౌరవించాలని కోరారు. ముఖ్యంగా సమాజ సంక్షేమంలో, సంప్రదాయ వైద్యంలో గిరిజన మహిళల సేవలు ప్రశంసనీయమన్నారు.

ఈ ఏడాది అంతర్జాతీయ గిరిజన దినోత్సవ ఇతివృత్తం ప్రాచీన వైద్య విధానాలు, సంప్రదాయ జ్ఞానం కలిగిన గిరిజన మహిళల ప్రాముఖ్యతను గుర్తుచేస్తోందన్నారు. మాతా శిశు ఆరోగ్యం, సమాజ సంక్షేమంలో గిరిజన మహిళల సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. గిరిజన సమాజంతో తనకు ఉన్న బంధం చాలా ప్రత్యేకమైనదని, వారి ప్రేమ, నమ్మకమే తనను వారి సంక్షేమం వైపు మరింత బాధ్యతగా నడిపిస్తున్నాయని పవన్ కల్యాణ్ తెలిపారు. గిరిజనుల వికాసానికి "అడవి తల్లి బాట" వంటి కార్యక్రమాల ద్వారా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మారుమూల గిరిజన ప్రాంతాలకు రోడ్డు వసతి పెంచడం, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంపై దృష్టి సారించామన్నారు. గిరిజనుల ప్రత్యేక జీవన విధానం, సంస్కృతి దెబ్బతినకుండానే అభివృద్ధి ఫలాలు ప్రతి గిరిజన కుటుంబానికి అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని స్పష్టం చేశారు.

ఆదివాసీల హక్కుల రక్షణ మన బాధ్యత ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా గిరిజనులకు లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు. ఆదివాసీ సంస్కృతి అంటే ప్రకృతితో కలిసి జీవించే ఒక జీవనతత్వమని లోకేశ్ అన్నారు. పరస్పర సహకారం, మంచితనం, మానవత్వరూపాలు ఆదివాసీలని లోకేష్ కొనియాడారు. ఆదివాసీల సమగ్ర అభ్యున్నతితో పాటు వారి సంస్కృతి, హక్కులను పరిరక్షించడం మనందరి బాధ్యత అన్నారు.

కూటమి ప్రభుత్వం కట్టుబడి (మిగతా 2లో)

# బోనమెత్తిన భాగ్యనగరం

## లాల్‌దర్వాజలో భక్తుల కోలాహలం




**టి మీడియా ,ఆగస్టు 9 , హైదరాబాద్ బ్యూరో :** భాగ్యనగరం బోనమెత్తింది. ఆషాఢ బోనాల సందర్భంగా ఓల్డ్‌సిటీ లాల్ దర్వాజా సింహవాహిని అమ్మవారి ఆలయంతో పాటు నగరవ్యాప్తంగా ఉన్న దేవాలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ఉదయం 4.30 గంటల నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలను నిర్వహించారు. ఆలయం తరఫున అమ్మవారికి తొలిబోనాన్ని సమర్పించారు. బోనాల పండుగ సందర్భంగా ఆలయానికి భక్తులు భారీగా తరలివస్తున్నారు. అమ్మవారిని పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అధికారులు చర్యలు చేపట్టారు. అక్కన్న మాదన్న మహంకాళి అమ్మవారిని మంత్రి శ్రీధర్‌బాబు దర్శించుకున్నారు. ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు.

### అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రులు

లాల్ దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారి బోనాల జాతరతో నగరమంతా ఆధ్యాత్మికశోభ నెలకొంది. జాతర సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. అమ్మవారికి మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్?లు పట్టువస్త్రాలను సమర్పించారు. కలెక్టర్ ప్రియాంక ఆల దర్శించుకుని అమ్మవారికి బంగారు బోనాన్ని సమర్పించారు. ఉదయం నుంచి రాత్రి 10.30 గంటల వరకు అమ్మవారికి బోనాలు, ఒడిబియ్యం, చీర, సారె సమర్పణలు ఉంటాయి. సాయంత్రం అమ్మవారి శాంతి కళ్యాణం కార్యక్రమం జరుగుతుంది.

### అమ్మవారి సేవలో రాజకీయ, సినీ ప్రముఖులు :

లాల్‌దర్వాజ సింహవాహిని అమ్మవారిని పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు దర్శించుకున్నారు. మంత్రి సీతక్క, ఎంపీ అనిల్ యాదవ్, బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, టాలీవుడ్ హీరో విజయ్ దేవరకొండ, ఆనంద్ దేవరకొండ, దర్శకుడు సందీప్ రెడ్డి వంగా, సింగర్ మంగ్లీ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

### భక్తులకోసం ప్రత్యేక ఏర్పాట్లు

భక్తుల కోసం 6 క్యూలైన్‌లు ఏర్పాటు చేసి దర్శనం కల్పిస్తున్నారు. బోనం తీసుకొచ్చే వారికి ప్రత్యేకంగా క్యూలైన్ ఏర్పాటు చేశారు. లాల్ దర్వాజా అమ్మవారి ఆలయ (మిగతా 2లో)

# రాజధానిలో 40 లక్షల ఓట్ల గల్లంతు

● సనత్‌నగర్‌లో ఏకంగా సగానికి పైగా మాయం



**టి మీడియా, ఆగస్టు 9, హైదరాబాద్ బ్యూరో:** తెలంగాణలో ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సర్వే(సర్) కార్యక్రమం సోమవారం ముగియనుంది. ఈ ఏడాది జూన్?లో ఓటరు ప్రక్రియ మొదలు కాగా అప్పటినుంచి పలు కారణాలతో ఆ సర్వేను అధికారులు పొడిగిస్తూ వచ్చారు. బీఎల్?వోలకు అందిన దరఖాస్తుల పరిశీలన అనంతరం హైదరాబాద్ నగరంలో ఓటర్ల సంఖ్య భారీ స్థాయిలో తగ్గనున్నట్టు తెలుస్తోంది. శనివారం సాయంత్రం వరకు నమోదైన లెక్కల ప్రకారం రాజధానిలోని మూడు జిల్లాల్లో 28 నియోజకవర్గాల్లో ఇప్పటికే 1.14 కోట్ల ఓటర్లు ఉన్నారు. వారిలో 40 లక్షల ఓట్లు గల్లంతు కానున్నట్లు అంచనా వేస్తున్నారు.

### 17న ముసాయిదా ఓటరు జాబితా

ఆది, సోమవారాల్లో ప్రభుత్వ సెలవు అయినప్పటికీ బీఎల్?వోలు , అలాగే ఉన్నతాధికారులు విధులకు హాజరవుతారని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ తెలిపారు. ఇంకా ఎన్యుమరేషన్? ఫారాలు అందించని వారు ఎవరైనా ఉంటే వెంటనే అధికారులకు సమర్పించాలని ఆయన సూచించారు. మరోవైపు ఈ నెల 17న ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

### సనత్‌నగర్‌లో దాదాపు సగం ఓట్లు

క్యూర్ పరిధిలోని చేవెళ్ల, కల్వకుర్తి, షాద్?నగర్? నియోజకవర్గాల్లో రద్దయ్యే ఓట్లను మినహాయించాలి. మిగిలిన 25 నియోజకవర్గాల్లో ఇబ్రహీంపట్నంలో 21.43 శాతం, బహదూర్‌పురలో 22.38 శాతం ఓట్లు అత్యల్పంగా రద్దు కానున్నాయని అంచనా. అయితే సనత్?నగర్? నియోజకవర్గం విషయానికొస్తే అక్కడ మొత్తం 2,54,030 ఓట్లు ఉన్నాయి. వాటిలో 1.16 లక్షల ఓట్లు అంటే 45.68 శాతం ఓట్లు రద్దు కాబోతున్నాయని సమాచారం. రానున్న రెండురోజుల్లో ఓటరు సంఖ్య 1శాతం పెరగటం లేదా తగ్గడం మాత్రమే జరుగుతుందని తెలుస్తోంది. ఎందుకంటే బోనాల పండుగ ఉండటం వల్ల (మిగతా 2లో)

# పెద్ది కుటుంబానికి కేసీఆర్ భరోసా

● రూ.2.25 కోట్ల సాయం అందజేత



**టి మీడియా ,ఆగస్టు 9 , హైదరాబాద్ బ్యూరో :** ఇటీవల మరణించిన బీఆర్?ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబాన్ని బీఆర్?ఎస్? అధినేత కేసీఆర్ పరామర్శించారు. సుదర్శన్?రెడ్డి స్వగ్రామం? వరంగల్ జిల్లా నల్లబెల్లికి వెళ్లిన కేసీఆర్?, దశదిన కర్మ కార్యక్రమానికి హాజరయ్యారు. సుదర్శన్‌రెడ్డి ఇంట్లో 40 నిమిషాల పాటు గడిపారు. సుదర్శన్‌రెడ్డి మరణంపై ఆవేదన వ్యక్తం చేసిన కేసీఆర్, పెద్ది సుదర్శన్‌రెడ్డితో తన అనుబంధం గుర్తుచేసుకొని కేసీఆర్ భావోద్వేగానికి గురయ్యారు. సుదర్శన్‌రెడ్డి ఉద్యమ ఘట్టాల ఫొటోలు చూస్తూ జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. సుదర్శన్‌రెడ్డి అత్యంత సాదాసీదా జీవితం (మిగతా 2లో)

# రేషన్ వ్యవస్థలో మరింత పారదర్శకతే లక్ష్యం



● ట్యాంపర్ ప్రూఫ్‌గా కొత్త రేషన్ కార్డులు

**టి మీడియా ,ఆగస్టు 9 , హైదరాబాద్ బ్యూరో :**
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ రేషన్? వ్యవస్థకు సంబంధించి ఇప్పటికే పలు మార్పులు చేసింది. దాంట్లో భాగంగానే స్మార్ట్? రేషన్? కార్డుల్ని పంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమయ్యింది. వీటిని స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రింటింగ్? పూర్తయిన కార్డులను ఇప్పటికే ఆయా జిల్లాలకు పంపించింది. రేషన్ వ్యవస్థల్లో మరింత పారదర్శకతను పెంచేలా ట్యాంపర్ ప్రూఫ్‌గా ఉండేందుకు ఈ కార్డులను పంపిణీ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి సంబంధించి సంగారెడ్డి జిల్లా కేంద్రంలో మధ్యాహ్నం 2 గంటలకు సీఎం రేవంత్?రెడ్డి రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఆ సమయంలోనే మిగిలిన 32 జిల్లా కేంద్రాల్లో కూడా ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 16.32 లక్షల కొత్త రేషన్ కార్డులను మంజూరు చేసినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం శనివారం ఓ ప్రకటనలో వెల్లడించింది. 3.42 కోట్ల మంది ప్రజలకు ఆహార భద్రత ఇప్పటికే పంచిన కొత్త రేషన్? కార్డులతో కలుపుకుని తెలంగాణ మొత్తంగా 1.05 కోట్లకు రేషన్?కార్డుల సంఖ్య చేరుకుంది. ప్రస్తుతం 3.24 కోట్ల మంది ప్రజలు ఆహార భద్రతను పొందుతున్నారని ఆ ప్రకటనలో ప్రభుత్వం వివరించింది. రాష్ట్రవ్యాప్తంగా కార్డు కలిగిన వారికి ప్రతి నెల ప్రభుత్వం సుమారు 2.16 లక్షల టన్నుల సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు పేర్కొంది.

**జిల్లాల్లో బాధ్యత కలెక్టర్లకు**

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి సంబంధించిన ప్రణాళిక, సమన్వయం, అమలు బాధ్యతలను ప్రభుత్వం ఆయా జిల్లాల కలెక్టర్లకు అప్పగించింది. రెవెన్యూ, పోలీస్? శాఖ, పౌర సరఫరాలతో పాటు ఇతర సంబంధిత శాఖలతో కలిసి ఈ కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించాలని సూచించింది. జిల్లాల వారీగా లబ్ధిదారుల జాబితాలను ఖరారు చేసి పూర్తి స్థాయిలో పరిశీలించాలని కలెక్టర్లను ఆదేశించింది. ఇప్పటికే సిద్ధంగా ఉన్న లామినేటెడ్? కార్డులను సురక్షితంగా, సకాలంలో పంపిణీ కేంద్రాలకు చేరేలా చూడాలని నిర్దేశించింది. ఈ పంపిణీకి ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులందరు కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని సూచించింది.

**సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్ సెల్**

స్మార్ట్ రేషన్ కార్డులను తీసుకోవడానికి వచ్చే వృద్ధులు, దివ్యాంగులకు ఇబ్బంది లేకుండా ప్రత్యేక క్యూ లైన్?లను ఏర్పాటు చేయాలని సూచించింది. పంపిణీ ప్రక్రియలో లబ్ధిదారులకు ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కరించేందుకు ప్రత్యేక గ్రీవెన్స్? సెల్?ను ఏర్పాటు చేయాలి. పంపిణీ పురోగతిని ప్రతిరోజు పరిశీలించి వాటికి సంబంధించిన వివరాలను పౌర సరఫరాల కమిషనర్?కు నివేదించాలని కలెక్టర్లను ఆదేశించింది. జిల్లాల్లో కార్డుల పంపిణీ ప్రక్రియను పర్యవేక్షించేందుకు సీనియర్ అధికారులను నోడల్ అధికారులుగా నియమించాలి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు కలెక్టర్లకు సర్క్యులర్ జారీ చేశారు.

# ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానం



● ఏ సి పి. తిరుపతి రెడ్డి

**టీ మీడియా ,ఆగస్టు 9,కూసుమంచి:**
ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని ఖమ్మం రూరల్ ఏసిపి తిరుపతి రెడ్డి అన్నారు. ఆదివారం ఖమ్మం జిల్లా, కూసుమంచి మండలం లోని నరసింహగూడెం గ్రామం నందు ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు గ్రామపంచాయతీ ఆఫీస్ నందు ప్రారంభించారు.ఈ సీసీ కెమెరాలు ఏర్పాటు కు తోడ్పాటు చేసిన నరసింహుల గూడెం గ్రామ సర్పంచ్ , గ్రామ పాలకమండలి సభ్యులు, ఉద్యోగులు, గ్రామ పెద్దలు, లను ప్రత్యేకంగా ఏసిపి శాలువాలతో సత్కరించినారు. ఈ సందర్భంగా ఏ సి పి మాట్లాడుతూ ఈ సి సి కెమెరాలు గ్రామాల్లో నేరాలు అరికట్టడానికి ఎంతో తోడ్పడతాయని తెలిపారు. కూసుమంచి మండలంలో ఉన్న ప్రతి గ్రామ సర్పంచ్ లు నరసింహులగూడెం గ్రామాన్ని ఆదర్శంగా తీసుకొని సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఏసిపి సూచించారు.ఈ కార్యక్రమంలో ఏసిపితో పాటు కూసుమంచి సిఐ సంజీవ్, ఎసిఐ నాగరాజు నరసింహుల గూడెం సర్పంచ్ ఉద్యోగస్తులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# బోనమెత్తిన భాగ్యనగరం

(మొదటి పేజీ తరువాయి)
ఆవరణ వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులు, వీఐపీలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు. అంబులెన్స్?, వాటర్ మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశారు. జోగినీలు ముందస్తు సమాచారం ఇస్తే అసౌకర్యం లేకుండా దర్శనం కల్పించనున్నారు. సోమవారం రంగం భవిష్యవాణి కార్యక్రమం, పోతురాజుల విన్యాసాలు, భవాని రథయాత్ర జరగనున్నాయి. ఏటా ఆషాఢమాసంలో బోనాల జాతరతో సింహవాహిని అమ్మవారిని దర్శించుకునేందుకు లక్షల్లో భక్తులు పోటెత్తున్నారు. ఈ ఏడాది దాదాపు ఐదు లక్షల మంది వస్తారని అంచనా. ప్రధాన 8 దేవాలయాలతో పాటు లాల్? దర్వాజాలో మూడు వేల చిన్న దేవాలయాల్లో అమ్మవారికి బోనాన్ని సమర్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా 100 సీసీటీవీ కెమెరాల పర్యవేక్షణ, 2500 భారీ పోలీసులతో బందోబస్తును ఏర్పాటు చేశారు.

# రాజధానిలో 40 లక్షల ఓట్ల గల్లంతు

(మొదటి పేజీ తరువాయి)
ఎక్కువ మొత్తంలో హెచ్చుతగ్గులు ఉండవని అధికారులు అంచనా వేస్తున్నారు

**రాజధాని రద్దయ్యే ఓట్లు(శాతాల్లో) :**

హైదరాబాద్? జిల్లా మలక్‌పేట్- 33.92, సనత్‌నగర్- 45.68, ముషీరాబాద్-39.77, జూబ్లిహిల్స్- 44.21, అంబర్‌పేట్- 36.17, గోషామహల్- 39.38, ఖైరతాబాద్-36.78, సికింద్రాబాద్- 38.47, కార్వాన్- 33.23, చార్మినార్- 32.49, నాంపల్లి- 31.33, బహదూర్‌పుర- 22.38, కంటోన్మెంట్‌లో35.31, యాకుత్‌పుర- 31.40, చాంద్రాయణగుట్ట- 32.57 శాతం. రంగారెడ్డి : ఇబ్రహీంపట్నం- 21.43, ఎల్బీనగర్- 42.19, మహేశ్వరం- 40.03, రాజేంద్రనగర్- 38.14, శేరిలింగంపల్లి- 36.60, చేవెళ్ల- 19.31, కల్వకుర్తి- 11.65, షాద్‌నగర్- 14.56 శాతం రద్దు కానున్నాయి. మేడ్చల్-మల్కాజిగిరి : మేడ్చల్- 29.30, మల్కాజిగిరి- 37.30, కుత్బుల్లాపూర్- 35.99, కూకట్‌పల్లి- 32.81, ఉప్పల్‌లో 40.05 శాతం ఓట్లు రద్దు కానున్నాయి. అధికంగా రాజధానిపై ప్రభావం రోజూ వేల మంది నగరానికి వలస వస్తుంటారు. వారు కొన్నాళ్లకు అక్కడే స్థిరనివాసం ఏర్పాటు చేసుకుంటున్నారు. దీంతో వాళ్ల నగరంలో కూడా ఓటరు గుర్తింపు తీసుకుంటున్నారు. ప్రస్తుతం అన్ని రాష్ట్రాల్లోనూ ఓటరు సర్వే జరుగుతోంది. ఈ క్రమంలో రెండు ఓట్లు కలిగిన ప్రజలు నగరంలో ఎన్యూమరేషన్ ఫారాలను అధికారులకు తిరిగివ్వలేదు. ప్రధానంగా సొంతూరిలోనే ఓటు హక్కు కొనసాగేలా చూస్తున్నారు. దాంతో శివారు నియోజకవర్గాలు, ప్రధాన నగరంలో లక్షల మంది ఫారాలను పక్కన పెట్టేశారు. కొన్ని ఘటనల్లో అధికారుల నిర్లక్ష్యం కూడా ఉందని తెలుస్తోంది.

# పెద్ది కుటుంబానికి కేసీఆర్ భరోసా

(మొదటి పేజీ తరువాయి)
గడిపారన్నారు. పెద్ది కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్న కేసీఆర్, పార్టీ తరఫున రూ.2.25 కోట్ల అందించారు. కేసీఆర్? రాక సందర్భంగా బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలతో నల్లబెల్లి గ్రామం జనసంద్రంగా మారింది. జోహార్ పెద్ది సుదర్శన్ రెడ్డి, జై కేసీఆర్ అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు.

# ప్రైవేట్ అంబులెన్స్ మాఫియా...?




● రోగుల ప్రాణాలతో చెలగాటం

**టీ మీడియా ఆగస్టు 9 ,బాన్సువాడ:**
కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలో ప్రైవేట్ అంబులెన్స్ నిర్వాహకులు, డ్రైవర్ల మాఫియా రోజు రోజుకు రెచ్చిపోతుంది. ప్రవేట్ అంబులెన్స్ డ్రైవర్ల వ్యవహారశైలిపై పలు ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. బాన్సువాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి పేద కుటుంబాల రోగులు అత్యవసర చికిత్స కోసం ఆస్పత్రులకు వచ్చే రోగులను ఏదో భయంకరమైన ఆందోళనకు గురిచేసి రోగులను ప్రవేట్ ఆసుపత్రులకు తరలించేలా కమీషన్ల కోసం తమకు అనుకూలమైన ప్రైవేట్ ఆస్పత్రులకు ప్రవేట్ అంబులెన్స్ డ్రైవర్లు తరలిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.అంతేకాకుండా అంబులెన్స్ డ్రైవర్లు రాత్రి వేళలో ఆసుపత్రిలో ఉంటూ అత్యవసర సేవల పేరిట మాఫియా ఇష్టారాజ్యంగా తిరుగుతూ పేద ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న సంఘటనలు లేకపోలేవని పలువురు రోగులు ఆరోపణలు చేయడం గమనార్హం. ప్రవేట్ అంబులెన్స్ డ్రైవర్ల కమిషన్ల దందా కొనసాగిస్తున్నారని రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతూ మాఫియా రాజ్యాంగ కొనసాగిస్తున్నారని ఆరోపణలు వినవస్తున్నాయి. అంతేకాకుండా ఒక రోగిని నిజాంబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాల్సి ఉన్నప్పటికీ డ్రైవర్లు మాత్రం ప్రైవేట్ ఆసుపత్రులకు తరలిస్తూ కమిషన్ల కక్కుర్తికై పేద ప్రజల ప్రాణాలతో బేరాలు ఆడుతున్నారని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులు కమిషన్ల ఆశ చూపుతూ డ్రైవర్లను మచ్చిక చేస్తూ దందాను మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగిస్తున్నారని విమర్శలు కూడా ఉన్నాయి. అంతేకాకుండా ఇలాంటి వ్యక్తులపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే. ముఖ్యంగా ఎంసిహెచ్ ఆస్పత్రి పరిసరాల్లో ప్రైవేట్ అంబులెన్స్‌లు పెద్ద సంఖ్యలో కనిపిస్తుండటంతో ఈ వ్యవహారంపై చర్చ జరుగుతోంది.

**రోగి దొరికితే చాలు**

అత్యవసర పరిస్థితుల్లో రోగిని ఒక ఆస్పత్రి నుంచి మరో ఆస్పత్రికి తరలించాల్సి వచ్చినప్పుడు కొందరు అంబులెన్స్ డ్రైవర్లు, నిర్వాహకులు కుటుంబ సభ్యుల నిర్ణయాలను పక్కనపెట్టి తమకు అనుకూలమైన ఆస్పత్రులకు తీసుకెళ్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. నిజామాబాద్, హైదరాబాద్ బాన్సువాడ పట్టణంలో తదితర ప్రాంతాల్లోని కొన్ని ప్రైవేట్ ఆస్పత్రులతో సంబంధాలు ఏర్పరచుకుని కమీషన్ల కోసం రోగులను తరలిస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది.

**రూ.20 వేల వరకు కమీషన్?**

బాన్సువాడ పట్టణ పరిధిలో సుమారు 30 వరకు ప్రైవేట్ అంబులెన్స్‌లు ఉన్నట్లు సమాచారం. కొందరు నిర్వాహకులు ప్రైవేట్ ఆస్పత్రులతో ఒప్పందాలు చేసుకుని ఒక్కో రోగిని తరలించినందుకు భారీగా కమీషన్లు పొందుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో కేసుకు రూ.20 వేల వరకు కమీషన్ తీసుకుంటున్నారన్న ప్రచారం ఉన్నప్పటికీ దీనిపై అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది.

**కరోనా సమయంలో మొదలైందా?**

కరోనా సమయంలో అత్యవసర సేవల్లో అంబులెన్స్ డ్రైవర్లు కీలక పాత్ర పోషించారు. ఆ సమయంలో ఏర్పడిన పరిచయాలను ఆసరాగా చేసుకుని కొందరు ప్రైవేట్ ఆస్పత్రులు రోగులను తమ వద్దకు తరలించేలా అంబులెన్స్ నిర్వాహకులతో సంబంధాలు ఏర్పరచుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం ఇదే వ్యవహారం కమీషన్ల దందాగా మారిందని పలువురు ఆరోపిస్తున్నారు.

**ముందస్తు ఒప్పందాలపై ఆరోపణలు...**

కొన్ని ప్రైవేట్ ఆస్పత్రులు అంబులెన్స్ నిర్వాహకులకు ముందుగానే డబ్బులు చెల్లించి తమ ఆస్పత్రులకు రోగులను తీసుకురావాలని ఒప్పందాలు చేసుకుంటున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించిన ఆధారాలను అధికారులు పరిశీలించాల్సి ఉంది. అత్యవసర పరిస్థితుల్లో కుటుంబ సభ్యుల అభిప్రాయానికి ప్రాధాన్యం ఇవ్వకుండా రోగులను నిర్దిష్ట ఆస్పత్రులకు తీసుకెళ్తే బాధిత కుటుంబాలు ఆర్థికంగా, మానసికంగా తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ఆస్పత్రుల పర్యవేక్షణ ఏదీ...?**

అంబులెన్స్‌లలో ఆక్సిజన్, వెంటిలేటర్ వంటి అత్యవసర సదుపాయాలు సక్రమంగా ఉన్నాయా? వాటిని నిర్వహించేందుకు అవసరమైన సిబ్బందికి ప్రాథమిక వైద్య పరిజ్ఞానం ఉందా? అత్యవసర సమయంలో రోగికి అవసరమైన ప్రథమ చికిత్స అందిస్తున్నారా? అనే అంశాలపై సంబంధిత అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

# కారును ఢీకొట్టిన కంటైనర్ లారీ..



⏭ ఆరుగురు మృతి

**టీ మీడియా ,ఆగస్టు 9 , భోపాల్:**
కంటైనర్ లారీ ఒక కారును ఢీకొట్టింది. ఈ కారులో ప్రయాణించిన ఆరుగురు ఈ ప్రమాదంలో మరణించారు. కంటైనర్ లారీ డ్రైవరును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మధ్యప్రదేశ్‌లోని ధార్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఆదివారం మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో బద్నావర్ పట్టణానికి సుమారు 4 కిలోమీటర్ల దూరంలోని పంచర్ వాసా సమీపంలో ఉజ్జయిని నుంచి వస్తున్న కంటైనర్ లారీ ఒక కారును ఢీకొట్టింది. కాగా, ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కారులో ప్రయాణించిన ఆరుగురు అక్కడికక్కడే మరణించినట్లు పోలీస్ అధికారి తెలిపారు. మృతులు గుజరాత్ వాసులని చెప్పారు. కంటైనర్ లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.

# ఆర్జీకర్ హత్యాచార ఘటనపై పునఃవిచారణ

(మొదటి పేజీ తరువాయి)
మృతదేహం సెమినార్ హాల్‌లో కనిపించింది. ఆమెపై అత్యాచారం చేసి హత్య చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహానికి కారణమైంది. వైద్యులు, జూనియర్ డాక్టర్లు, విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. ఘటన అనంతరం ఆసుపత్రి భద్రత, వైద్యుల రక్షణపై కూడా తీవ్ర చర్చ జరిగింది. దేశవ్యాప్తంగా వైద్యులు నిరసనలు చేపట్టడంతో ఈ కేసు జాతీయ స్థాయిలో చర్చనీయాంశమైంది. ఆందోళనలు రోజురోజుకూ ఉధృతం కావడంతో అప్పటి బెంగాల్ ప్రభుత్వంపై కూడా తీవ్ర విమర్శలు వచ్చాయి.

**హైకోర్టు ఆదేశాలతో సీబీఐ దర్యాప్తు**

కేసు దర్యాప్తును మొదట రాష్ట్ర పోలీసులు చేపట్టారు. అయితే దర్యాప్తు తీరుపై అనేక అనుమానాలు వ్యక్తం కావడంతో కలకత్తా హైకోర్టు ఈ కేసును సీబీఐకి అప్పగించింది. అనంతరం కేంద్ర దర్యాప్తు సంస్థ వివిధ కోణాల్లో విచారణ చేపట్టింది. ఈ కేసులో ఆసుపత్రి పరిసరాల్లోని పరిస్థితులు, సీసీటీవీ దృశ్యాలు, సాక్షుల వాంగ్మూలాలు, ఫోరెన్సిక్ ఆధారాలు తదితర అంశాలను దర్యాప్తు సంస్థ పరిశీలించింది. మరోవైపు కేసులో కుట్ర కోణం కూడా ఉందా? అనే అంశంపైనా దర్యాప్తు కొనసాగుతోంది.

**సంజయ్ రాయ్‌కు జీవిత ఖైదు**

ఈ కేసులో నిందితుడిగా గుర్తించిన సంజయ్ రాయ్‌పై విచారణ సాగింది. చివరకు 2025 జనవరిలో సీల్దా సెషన్స్ కోర్టు అతడిని దోషిగా తేల్చింది. అతడికి జీవితాంతం జైలు శిక్ష విధించింది. అదనంగా రూ.50 వేల జరిమానా కూడా విధించినట్లు అప్పటి తీర్పులో పేర్కొన్నారు. అయితే సంజయ్ రాయ్ ఒక్కరే ఈ నేరానికి పాల్పడ్డాడనే అంశంపై బాధితురాలి తల్లిదండ్రులు, ఆమె సహచర వైద్యులు అనుమానాలు వ్యక్తం చేస్తూనే ఉన్నారు. ఈ దారుణ ఘటనలో మరికొందరి ప్రమేయం ఉండొచ్చని వారు మొదటి నుంచీ చెబుతున్నారు. ఈ నేపథ్యంలో తాజా పునఃవిచారణపై ఆసక్తి నెలకొంది.

ఇక ఆర్జీకర్ ఘటనకు రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం బంగాల్?లోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో రెండు నిమిషాల మౌనం పాటించారు. వైద్యులు, నర్సులు, ఇతర వైద్య సిబ్బంది బాధితురాలిని స్మరించుకున్నారు. కోల్‌కతాలోని ఆరోగ్యశాఖ ప్రధాన కార్యాలయం స్వాస్థ్య భవన్‌లోనూ ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ శరద్విత్ ముఖర్జీ, ఉన్నతాధికారులు రెండు నిమిషాల మౌనం పాటించారు. ఆర్జీకర్ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యులు, నర్సులు, సిబ్బందితో పాటు అక్కడ భద్రత కోసం మోహరించిన పారామిలటరీ సిబ్బంది కూడా మౌనం పాటించి బాధితురాలికి నివాళు లర్పించారు. బాధితురాలి తల్లి స్మారక కార్యక్రమంలో పాల్గొని మొక్కను నాటి, దానికి నీరు పోశారు. ం

# కాంగ్రెస్ నూతన కమిటీలు ఏకగ్రీవం



**టీమీడియా,ఆగస్టు 9,కురవి:**
గ్రామ సర్పంచ్ జక్కుల మాధవి నాగన్న ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ, యువజన, సోషల్ మీడియా, బూత్ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.గ్రామ కాంగ్రెస్ కమిటీ: అధ్యక్షుడిగా దొంగల జనార్దన్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా బుర్ర బిక్షపతి, కార్యదర్శిగా మద్దినాల కొమరవెల్లి ఎన్నికయ్యారు. సభ్యులుగా జిన్న రమణ, కందిపాటి సురేష్, బుడిగ రవీందర్, పొన్నబోయిన వీరన్న, కాకి వీరన్న, పొన్నెబోయిన లక్ష్మీనారాయణ, పొన్నాబోయిన శ్రీనివాస్ ఉన్నారు.యువజన విభాగం: అధ్యక్షుడిగా తాడబోయిన లింగబాబు, ఉపాధ్యక్షుడిగా కాకి ప్రవీణ్, కార్యదర్శిగా బొల్లు వేణు ఎన్నికయ్యారు. సభ్యులుగా బొబ్బల శ్రీకాంత్, బుడిగే అనిల్, షాగాని సందీప్, కందుల యాకన్న, బుర్ర భాను, నరసింగం యాకన్న, శ్రీపతి, పొన్నబోయిన ప్రశాంత్ ఉన్నారు.సోషల్ మీడియా విభాగం: అధ్యక్షుడిగా బుడిగే సుభాష్, ఉపాధ్యక్షుడిగా కడారి రమణయ్య, కార్యదర్శిగా నూకల రమేష్ ఎన్నికయ్యారు. సభ్యులుగా బుర్ర అరవింద్, బొల్లం వినోద్, జిన్న చింటూ, చిన్న అయిలయ్య, అక్కనపల్లి నవనీత్, కందిపాటి చరణ్, జిన్న వెంకటేష్, నాంపల్లి సతీష్ ఉన్నారు.బూత్ కమిటీలు: 51వ బూత్ బియల్ఎ గా బుడిగ రమేష్, సభ్యులుగా గజ్జి అనిల్ కుమార్ యాదవ్ దేశ్ముఖ్, కడారి వీరన్న, జక్కుల శ్రీనివాస్, అనంతల ఉపేందర్ ఉన్నారు. 52వ బూత్ బియల్ఎ గా వడ్లకొండ రాములు, సభ్యులుగా దుస్స వీరేష్, వడ్లకొండ కొమురయ్య, చీకటి శ్రీనివాస్, పొన్నెబోయిన కోటయ్య ఉన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ జక్కుల మాధవి నాగన్న, వార్డు సభ్యులు గజ్జి అనిల్ కుమార్ యాదవ్ దేశ్ముఖ్, బుడిగ రమేష్, వడ్లకొండ రాములుతో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువకులు పాల్గొన్నారు.

# వృద్ధురాలి హత్య కేసులో ఇద్దరు నిందితులు అరెస్ట్



**టి మీడియా, ఆగస్టు 9, తిరుమలాయపాలెం:**
తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు గ్రామంలో జూలై 17న అర్ధరాత్రి వృద్ధురాలిని హత్య చేసి ఆమె వద్ద ఉన్న బంగారు ఆభరణాలను దోచుకెళ్లిన కేసును కూసుమంచి సర్కిల్ పోలీసులు చాకచక్యంగా ఛేదించారని ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు పిండిప్రోలు గ్రామానికి చెందిన ఐతనబోయిన ప్రశాంత్ (26), అదేవిధంగా అతనికి సహకరించిన బాలినిధర్మారం, మరిపెడ మండలం, మహబూబాబాద్ జిల్లాకు చెందిన సరగండ్ల మహేష్ (20), లను ఆదివారం ఉదయం తిరుమలాయపాలెం రోడ్డులో పోలీసులు అరెస్ట్ చేసినట్లు తెలిపారు. కేసు వివరాలు ప్రకారం... పిండిప్రోలు గ్రామంలో చికెన్ షాప్ నిర్వహిస్తున్న ఐతనబోయిన ప్రశాంత్ కు మద్యం సేవించడం, ఆన్లైన్ బెట్టింగ్ కారణంగా ఆర్థిక ఇబ్బందులు ఏర్పడ్డాయని, తన చికెన్ షాప్ సమీపంలో నివసిస్తున్న వృద్ధ దంపతులను గమనిస్తూ... వృద్ధురాలు చెన్న సుగుణ మెడలో బంగారు ఆభరణాలు ఉన్నట్లు గుర్తించి వాటిని దోచుకోవాలని పథకం వేసుకున్నాడని తెలిపారు.ూశ్రీంశీ =ఝఘ - ఆంధ్రాలో చైన్ స్నాచింగ్, తెలంగాణాలో క్యాచింగ్నాలుగు బృందాలుగా ఏర్పడి కేసును ఛేదించిన పోలీసులుఈ క్రమంలో జులై 17 న అర్ధరాత్రి సమయంలో, వృద్ధురాలి ఇంటికి వెళ్లిన ప్రశాంత్ బంగారు ఆభరణాలు దోచుకునే ప్రయత్నం చేయగా ఆమె ప్రతిఘటించిందని, దీంతో తన వెంట తీసుకెళ్లిన ఇనుప రాడ్డుతో ఆమెపై దాడి చేసి హత్య చేసి, ఆమె మెడలో ఉన్న బంగారు చైన్, నల్లపూసల చైన్ సంబంధించిన బంగారు బిళ్లలను తీసుకొని అక్కడి నుంచి పరారయ్యాడని తెలిపారు. హత్య అనంతరం దొంగిలించిన బంగారు చైన్ ను తన వరుసకు బామ్మర్ది అయిన సరగండ్ల మహేష్ కు ఇచ్చి బ్యాంక్ లో పెట్టి డబ్బులు తెమ్మని చెప్పగా, మహేష్ ఆ బంగారు చైన్ ను తన పేరుతో ఖమ్మంలో ఒక బ్యాంక్ లో తనఖా పెట్టి రూ.1,50,000/- రుణం పొందినట్లు పోలీస్ దర్యాప్తులో వెల్లడైందన్నారు. ఈ కేసు దర్యాప్తు అధికారిగా కూసుమంచి సర్కిల్ ఇన్స్పెక్టర్ సంజీవ్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్సై కూచిపూడి జగదీష్, పి. సంతోష్, జే.నాగరాజు, హరికృష్ణ పిఎస్ఐ దివ్య తో ఏర్పాటు అయిన నాలుగు ప్రత్యేక బృందాలు సమన్వయంతో దర్యాప్తు చేపట్టి నిందితులను త్వరితగతిన అరెస్టు చేశారని పేర్కొన్నారు. అలాగే సిబ్బంది పూర్ణ చందర్ రావు, శ్రీలత, కిషన్, రాంబాబు, తొంట శ్రీనులను పోలీస్ ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అభినందించారు. కేసుకు సంబంధించిన ఇతర అంశాలపై దర్యాప్తు కొనసాగుతోందన్నారు. నిందితుల నుంచి బంగారు బిళ్లలు (ఏసులు)= 09, మొబైల్ ఫోన్ =02, నేరానికి ఉపయోగించిన ఇనుప రాడ్, ద్విచక్ర వాహనం గోల్డ్ లోన్ సంబంధిత పత్రాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ప్రతిభ చూపిన సిబ్బందికి రివార్డు అందజేశారు.

# ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు

**⏭ పతాకాన్ని ఆవిష్కరించిన సర్పంచ్ రమాదేవి**



**టీమీడియా,ఆగస్టు 9, ఆళ్లపల్లి :**
మండలం మార్కోడు గ్రామంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలను అత్యంత ఉత్సాహంగా, ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో గ్రామ సర్పంచ్ సుతారి రమాదేవి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక గిరిజన/ఆదివాసీ జెండాను ఆవిష్కరించారు. జెండా ఆవిష్కరణ అనంతరం ఆ ప్రాంతంలో ఆదివాసీల నినాదాలు మిన్నంటేలా సంబరాలు జరిగాయి.?జెండా ఆవిష్కరణ అనంతరం సర్పంచ్ సుతారి రమాదేవి మాట్లాడుతూ... ప్రపంచ వ్యాప్తంగా ఆదివాసీల ఉనికిని, వారి విశిష్ట సంస్కృతి, సాంప్రదాయాలను గుర్తించి గౌరవించేందుకు ఈ దినోత్సవం దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రకృతితో మమేకమై జీవించే ఆదివాసీలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి, హక్కుల సాధనకు మరియు పిల్లలకు నాణ్యమైన విద్యనందించడానికి తల్లిదండ్రులు, ప్రతినిధులు ముందుకురావాలని ఆమె కోరారు.మార్కోడు గ్రామ పంచాయతీ పరిధిలోని గిరిజన కుటుంబాల సంక్షేమం, తాగునీరు, రహదారులు తదితర మౌలిక వసతుల కల్పనకు తమ పాలకవర్గం నిరంతరం శ్రమిస్తుందని సర్పంచ్ హామీ ఇచ్చారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ఆదివాసీలందరికీ చేరేలా చూస్తామన్నారు?ఈ వేడుకల్లో గ్రామ ఉపసర్పంచ్ వగలబోయిన సతీష్ , పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, గిరిజన సంఘాల నాయకులు, మహిళలు, పాఠశాల విద్యార్థులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జెండా ఆవిష్కరణ అనంతరం గ్రామస్తులకు, పిల్లలకు మిఠాయిలు పంపిణీ చేశారు.

# ఆదివాసీ దినోత్సవ వేడుకలు



**టీ మీడియా,ఆగస్టు9,చింతూరు:**
ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఐ.టి.డి.ఏ ఆధ్వర్యంలో ఎ పి ఆర్ గ్రౌండ్‌లో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రాజెక్టు అధికారి శుభం నోఖ్వల్, తరఫున ఎ పి ఓ రామ తులసి, ఆదివాసీ నాయకుల సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది.ఉదయం ఐ.టి.డి.ఏ., కార్యాలయ ప్రాంగణంలో ఎ పి ఓ . రామ తులసి, , ఆదివాసీ నాయకులతో కలిసి బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం జాతీయ జెండా మరియు ఆదివాసీ జెండాను ఎగురవేశారు. అక్కడి నుండి బైక్ ర్యాలీగా చింతూరు సెంటర్‌కు చేరుకుని, అక్కడ ఉన్న గిరిజన నాయకుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఆదివాసీ నాయకుల చేత ఆదివాసీ జెండాను ఎగురవేసిన అనంతరం ఎ పి ఆర్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ప్రధాన వేదిక వద్దకు చేరుకున్నారు. ఏపీ ఆర్ గ్రౌండ్‌లో వెలుగు, విద్య, వైద్యం, జీసీసీ , ఐసిడిఎస్ తదితర శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను, ఎ పి ఓ . రామ తులసి, ఆదివాసీ నాయకులు సందర్శించారు. కార్యక్రమంలో పాల్గొంటున్నారని తెలిపారు. చింతూరు డివిజన్‌లో గిరిజనులు సేకరిస్తున్న తేనె, పట్టు దారాలు, తాటి బెల్లం తదితర ఉత్పత్తులకు సంబంధించి ఒప్పందాలు చేసుకునే కార్యక్రమంలో కూడా ఆయన పాల్గొంటున్నారని తెలిపారు. వివిధ రంగాల్లో నైపుణ్యం కనబరిచిన 10 మంది గిరిజన ఆదివాసీలను, పదవ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన 11 మంది గిరిజన విద్యార్థులను, అలాగే ఉత్తమ సేవలందించిన 4 మంది గిరిజన ఉద్యోగులను ఘనంగా సన్మానించి మెమెంటోలు అందజేశారు. అనంతరం ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన వారికి భోజన వసతి ఏర్పాటు చేశారు.

# యువకుడిని గాయపరిచిన ముసలి



**టీ మీడియా, ఆగస్టు 9 ,ఆత్మకూరు:**
వనపర్తి జిల్లా మదనాపురం మండలంలోని గోపన్ పేట గ్రామ సమీపంలో ఉన్న రామన్ పాడు బ్రిడ్జి బ్యాక్ వాటర్ నది దగ్గరకు చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు మహేష్ 30 సంవత్సరాల గోపన్ పేట యువకుడిని ఓడ్డు అంచుకు వచ్చిన ముసలి దాడి చేసి గాయపరచడం జరిగింది. స్థానిక మత్స్యకారులు వెంటనే ప్రభుత్వ దవఖానకు తీసుకువచ్చి ట్రీట్మెంట్ చేయించుకోవడం జరిగింది. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రి వైద్యులు జిల్లా ఆస్పత్రికి తరలించారు.

# నామినేటెడ్ పదవిలో సీనియార్టీకి గుర్తింపు

**⏭ మన్నెం అప్పారావుకు పదవి దక్కాలని ఆకాంక్ష..?**



**టీ మీడియా, ఆగస్టు 9 దమ్మపేట:**
నలభై ఏళ్లకు పైగా ప్రజాక్షేత్రంలో మచ్చలేని రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగిస్తూ, నిబద్ధత గల నాయకుడిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు మన్నెం అప్పారావు. దమ్మపేట మండల రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన ఆయన, వివాదరహితుడిగా మరియు క్షేత్రస్థాయిలో బలమైన ప్రజాదరణ కలిగిన ఫైర్ బ్రాండ్‌గా నిలిచారు. రెండుసార్లు ప్రజా తీర్పుతో విజయం సాధించి ప్రజాప్రతినిధిగా సేవలందించిన ఆయన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ప్రధాన అనుచరుడిగా వెన్నంటి నడుస్తున్నారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలోనే ప్రతిష్టాత్మక నామినేటెడ్ పదవులను భర్తీ చేయనుండటంతో, ఈ రేసులో మన్నెం పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. పార్టీ కోసం, ప్రజల కోసం దశాబ్దాలుగా నిరంతరం శ్రమిస్తున్న ఆయన విశ్వసనీయతకు ఈసారి ఖచ్చితంగా తగిన గుర్తింపు లభిస్తుందని స్థానిక కాంగ్రెస్ శ్రేణులు, ఆయన అభిమానులు గట్టి ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**మండల రాజకీయాల్లో అజాతశత్రువు**

దమ్మపేట మండల రాజకీయాల్లో 1980వ దశకం నుంచే మన్నెం పేరు మార్మోగిపోతోంది. ఇక్కడ ఆయన పేరు తెలియని వారు ఉండరంటే అతిశయోక్తి కాదు. అందరికీ సుపరిచితుడైన ఆదర్శ రైతుగా, నిబద్ధత గల రాజకీయ నాయకుడిగా ఆయన ఎదిగారు. నియోజకవర్గ, మండల స్థాయి పార్టీ శ్రేణులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ, అందరి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ కార్యకర్తల పాలిట "తలలో నాలుకలా" మారారు. రాజకీయాల్లో ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొన్నప్పటికీ, ఎన్నడూ ఆత్మవిశ్వాసం కోల్పోకుండా, అవినీతి మచ్చ లేకుండా క్లీన్ ఇమేజ్‌తో మండలంలో అజాతశత్రువుగా పేరు సంపాదించుకోవడం ఆయన ప్రత్యేకత.

**తుమ్మల వెన్నంటి నిలిచిన విశ్వాసపాత్రుడు:**

మన్నెం అప్పారావు కేవలం ఒక స్థానిక నాయకుడు మాత్రమే కాదు, రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు అత్యంత నమ్మకస్తుడు, చిరకాల మిత్రుడు. దశాబ్దాలుగా తుమ్మల రాజకీయ ప్రస్థానంలో అప్పారావు ఒక కీలక స్తంభంలా నిలిచారు. తుమ్మల అప్పగించిన ప్రతి బాధ్యతను అత్యంత సమర్థవంతంగా నిర్వహిస్తూ, ఆయన నమ్మకాన్ని నిలబెట్టుకున్నారు. తుమ్మల వెన్నంటి ఉంటూ నియోజకవర్గ అభివృద్ధిలో, పార్టీ బలోపేతంలో అప్పారావు పోషించిన పాత్ర అనన్యసామాన్యం. ఈ సుదీర్ఘ అనుబంధం, విశ్వసనీయత రానున్న నామినేటెడ్ పదవుల ఎంపికలో ఆయనకు పెద్ద ప్లస్ పాయింట్‌గా మారే అవకాశం ఉంది.

**నామినేటెడ్ పదవికి అన్ని విధాలా అర్హుడు**

కాంగ్రెస్ ప్రభుత్వం మరో నాలుగు ఐదు రోజుల్లో నామినేటెడ్ పదవులను భర్తీ చేయనున్న తరుణంలో, మన్నెం అప్పారావు లాంటి సీనియర్, కష్టపడే నాయకుడికి ఖచ్చితంగా పదవి దక్కాలని దమ్మపేట మండల పార్టీ శ్రేణులు ముక్తకంఠంతో కోరుతున్నాయి. సీనియారిటీ, ప్రజాదరణ, పార్టీ పట్ల నిబద్ధత, అంకితభావం వంటి అన్ని కోణాల్లో పరిశీలిస్తే నామినేటెడ్ పదవికి అప్పారావు అన్ని విధాలా అర్హుడని మండల కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేస్తున్నారు. నాలుగు దశాబ్దాల ఆయన నిరంతర రాజకీయ సేవలకు గుర్తింపుగా అధిష్టానం మరియు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవ తీసుకుని ఆయనకు సముచిత స్థానం కల్పించాలని మండలంలోని కాంగ్రెస్ శ్రేణులు మరియు ఆయన అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# భూములు కోల్పోయిన రైతులకు చెక్కుల పంపిణీ




**⏭ పాల్గొన్న ఎంపీ ,ఎమ్మెల్యే**

**టీ మీడియా, ఆగస్టు 9 ,ఆత్మకూరు:**
వనపర్తి జిల్లా మదనపురం మండలం కొన్నూరు గ్రామంలో రైల్వే లైన్ విస్తరణలో భాగంగా భూములు కోల్పోయిన రైతులకు పరిహారం చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మహబూబ్నగర్ ఎంపీ డీకే అరుణ, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పరిహారం కు సంబంధించిన చెక్కులను మహబూబ్ నగర్ ఎంపీ శ్రీమతి డికె. అరుణ తో కలిసి అందజేశారు. కార్యక్రమంలో రైల్వే అధికారులు, రెవెన్యూ అధికారులు, ఆర్డీఓ తహసీల్దార్, గ్రామ సర్పంచ్, ప్రజాప్రతినిధులు, అధికారులు, మీడియా ప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీల సమగ్ర అభివృద్ధే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

ఉంది. భూమిపై ఆది నుంచి జీవిస్తున్నది ఆదివాసీలేనని, వారి హక్కులు, విశిష్ట సంస్కృతిని గుర్తుచేసుకునే రోజు ఆగస్టు 9 అని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి పేర్కొన్నారు. అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆమె గిరిజనులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆదివాసీల జీవిత సూత్రం 'జల్, జంగల్, జమీన్' అని ఆమె అభివర్ణించారు. గిరిజనులకు లబ్ధి చేకూర్చేందుకే నాడు చంద్రబాబు జీవో 3 తీసుకువచ్చారని మంత్రి గుర్తుచేశారు. అయితే, వైఎస్సార్సీపీ హయాంలో ఆ జీవో రద్దయితే, గిరిజనుల ప్రయోజనాల కోసం కనీసం రివ్యూ పిటిషన్ కూడా వేయలేదని మండిపడ్డారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే గిరిజన యువకులను గొడ్డలి పార్టీ రెచ్చగొడుతోందని సంధ్యారాణి ధ్వజమెత్తారు. నీరు, అడవి, భూమి ఆదివాసీలకు దేవాలయంతో సమానమని, అడవిని కాపాడే ఆదివాసీల అభివృద్ధే దేశ అభివృద్ధని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి అన్నారు. గిరిజనుల విద్య, ఉద్యోగ వికాసానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు.

# ఖమ్మంలో ఫంక్షన్ హాళ్లకు “పసు” చట్టమా?

**⏭ అధికారుల అండతో నిబంధనలకు తూట్లు?**
**⏭ ఇరిగేషన్ కాలువ స్థలం తనదేనంటూ హుంకరింపు**
**⏭ అనుమతులు, పార్కింగ్, భద్రతా నిబంధనలపై తీవ్ర ఆరోపణలు**

**ఖమ్మం నగరంలో కొందరు ఫంక్షన్ హాళ్ల నిర్వాహకులకు ప్రభుత్వ నిబంధనలు వర్తించవా? అధికారుల అండదండలతో తమకంటూ ప్రత్యేక “పసు” చట్టాన్ని అమలు చేసుకుంటున్నారా? అనే ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఒక వ్యక్తి నిర్వహణలో ఉన్న మూడు వేర్వేరు ఫంక్షన్ హాళ్లు, కొన్ని ఆస్పత్రుల విషయంలో అనుమతులు, పార్కింగ్, భద్రతా ప్రమాణాలు, భవన వినియోగంపై తీవ్ర ఆరోపణలు వెలువడుతున్నాయి. రెండు దశాబ్దాల క్రితం సాధారణ వ్యక్తిగా ఉన్న వ్యక్తి ప్రస్తుతం ఖమ్మం నగరంలో పలుచోట్ల తన పలుకుబడిని ఉపయోగిస్తూ వ్యాపార కార్యకలాపాలు సాగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వైద్య రంగంతో ప్రత్యక్ష సంబంధం లేని వ్యక్తి పలు ఆస్పత్రుల నిర్వహణలో భాగస్వామిగా ఉన్నారని, ఫంక్షన్ హాళ్లను కూడా ఇదే తరహాలో నిర్వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.** టీ మీడియా, ఆగస్టు 9, ఖమ్మం బ్యూరో:




ఇరిగేషన్ కాలువ ప్రాంతం



కాలువ స్లాబ్ వైపు వెళ్లకుండా మూసి వేత




### ఇరిగేషన్ కాలువపైనే కన్ను?

మామిళ్లగూడెం ప్రాంతం గుండా వెళ్లే ఇరిగేషన్ కాలువపై ప్రభుత్వ నిధులతో స్లాబ్ నిర్మించి, ఆ స్థలాన్ని వ్యాపార అవసరాలకు ఉపయోగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో ఆ ప్రాంతాన్ని ప్రజలు వాహనాల పార్కింగ్‌కు వినియోగించుకునేవారని స్థానికులు చెబుతున్నారు. కాలువ పక్కనే ఉన్న ఇరుకైన మార్గంలోని భవనంలో సరైన అనుమతులు లేకుండానే ఫంక్షన్ హాల్ నిర్వహిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ/కాలువ స్థలాన్ని ఆక్రమించి, ఇతరులు అటువైపు రాకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆ ప్రాంతంలోకి వెళ్లే వారిని అడ్డుకోవడం, ప్రశ్నించిన వారిపై దౌర్జన్యానికి దిగుతున్నారనే ఆరోపణలు కూడా స్థానికుల నుంచి వస్తున్నాయి.

### నగరంలో మూడు ఫంక్షన్ హాళ్లు

ఖమ్మం నగరంలో ఒకే వ్యక్తి ఆధ్వర్యంలో మూడు ఫంక్షన్ హాళ్లు ఇదే తరహాలో నడుస్తున్నాయని ఆరోపణలు ఉన్నాయి. వాటిలో భవన అనుమతులు, పార్కింగ్ సౌకర్యాలు, అగ్నిమాపక భద్రత, అత్యవసర నిష్క్రమణ మార్గాలు, దివ్యాంగుల సౌకర్యాలు వంటి అంశాలపై అధికారులు సమగ్ర తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. నగర విస్తరణ, పెరుగుతున్న జనాభా, చిన్నచిన్న కార్యక్రమాల అవసరాల నేపథ్యంలో మినీ ఫంక్షన్ హాళ్లకు డిమాండ్ పెరిగింది. ఈ నేపథ్యంలో ఖమ్మం నగరంలో సుమారు 50 వరకు ఫంక్షన్ హాళ్లు నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు అక్రమ నిర్మాణాలు, అనుమతుల ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన సమయంలో కొందరు అధికార పార్టీకి చెందిన వ్యక్తుల అండతో అక్రమాలకు పాల్పడుతున్న వారికి రక్షణ లభిస్తోందనే విమర్శలు ఉన్నాయి.

### నిబంధనలు ఎక్కడ?

ఫంక్షన్ హాళ్ల నిర్వహణకు సంబంధించిన తెలంగాణ ప్రభుత్వ మార్గదర్శకాలు, భవన అనుమతులు, పార్కింగ్ ప్రమాణాలు, అగ్నిమాపక భద్రత, అత్యవసర మార్గాలు తదితర నిబంధనలను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. కానీ, సంబంధిత హాళ్లలో నిబంధనలు ఎంతవరకు అమలవుతున్నాయనే అంశంపై అధికార యంత్రాంగం సమగ్ర విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

### రెండు కార్ల పార్కింగ్‌కే అనుమతి?

వైరా రోడ్‌లోని పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న సందులో నాలుగు అంతస్తుల భవనంలో నిర్వహిస్తున్న ఫంక్షన్ హాల్‌పై కూడా అనుమతులపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ భవనానికి ఫంక్షన్ హాల్ నిర్వహణకు మున్సిపల్ అనుమతి లేదని, కేవలం రెండు కార్ల పార్కింగ్‌కు మాత్రమే అనుమతి ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి.అదే భవనంలో ఆస్పత్రి, బ్యాంక్, ఇన్సూరెన్స్ కంపెనీ కార్యాలయం తదితర సంస్థలు కొనసాగుతున్నట్లు సమాచారం. నాలుగో అంతస్తులో ఫంక్షన్ హాల్ ఉండగా, మొత్తం భవనానికి ఒకే లిఫ్ట్ ఉండటం, అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లేందుకు సరైన ప్రత్యామ్నాయ మార్గాలు లేకపోవడం ప్రమాదకరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ఇంతటి జనసాంద్రత కలిగిన భవనంలో భద్రతా ప్రమాణాలు, అగ్నిమాపక అనుమతులు, అత్యవసర నిష్క్రమణ మార్గాలపై అధికారులు ప్రత్యేకంగా తనిఖీ చేయాల్సిన అవసరం ఉంది.

### బైపాస్ రోడ్డుపైనే పార్కింగ్?

బైపాస్ రోడ్డులో ఉన్న మరో ఫంక్షన్ హాల్‌కు కూడా అనుమతులపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సెల్లార్ నుంచి లిఫ్ట్ ద్వారా ఫంక్షన్ హాల్‌కు చేరుకోవాల్సి ఉండగా, వాహనాలకు సరైన పార్కింగ్ సౌకర్యం లేదని, బైపాస్ రోడ్డుపైనే వాహనాలు నిలుపుతున్నారని ఆరోపణలు ఉన్నాయి.భవనం సెల్లార్, ఎలివేషన్ తదితర ప్రాంతాలను ఓ కార్పొరేట్ సంస్థ లీజుకు తీసుకున్నట్లు సమాచారం. అయినప్పటికీ ఫంక్షన్ హాల్ నిర్వహణకు సంబంధించిన అనుమతులు, వినియోగ మార్పులు, పార్కింగ్ నిబంధనలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

### దివ్యాంగులు, మహిళలకు ప్రత్యేక సౌకర్యాలు ఎక్కడ?

మూడు ఫంక్షన్ హాళ్లలోనూ దివ్యాంగులు, మహిళల కోసం అవసరమైన ప్రత్యేక సౌకర్యాలు లేవనే ఆరోపణలు ఉన్నాయి. ఒకే మార్గంలో రాకపోకలు సాగాల్సి రావడం, అత్యవసర సమయంలో బయటకు వెళ్లే ప్రత్యామ్నాయ మార్గాలు లేకపోవడం ఆందోళన కలిగించే అంశమని స్థానికులు చెబుతున్నారు.ప్రత్యేకించి సెల్లార్ నుంచి లిఫ్ట్ ద్వారా ప్రయాణించాల్సిన పరిస్థితుల్లో అగ్ని ప్రమాదం లేదా ఇతర అత్యవసర పరిస్థితులు ఏర్పడితే పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### ఆస్పత్రుల నిర్వహణపైనా ఆరోపణలు

ఇదే వ్యక్తి నిర్వహణలో ఉన్నట్లు చెబుతున్న కొన్ని ఆస్పత్రుల విషయంలోనూ భవన వినియోగం, అనుమతులు తదితర అంశాలపై ఆరోపణలు ఉన్నాయి.

ఒక ఆస్పత్రి భవనానికి మున్సిపల్ రికార్డుల్లో నివాస భవనం అని, వైద్య ఆరోగ్యశాఖ రికార్డుల్లో మాత్రం నివాసేతర భవనం అని నమోదై ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై సంబంధిత శాఖలు రికార్డులను పరిశీలించి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉంది. అలాగే వైద్య సేవలు అందించకుండానే అందించినట్లు చూపించి నకిలీ బిల్లులు సృష్టించి కోట్ల రూపాయల మేర అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు పూర్తిస్థాయి విచారణ జరపాల్సి ఉంది.

### మామూళ్ల వ్యవహారమేనా?

ఫంక్షన్ హాళ్లు, ఆస్పత్రులు, భవన వినియోగం, పార్కింగ్, ఇరిగేషన్ స్థలాల వినియోగం వంటి అంశాలపై ఇన్ని ఆరోపణలు ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం వెనుక మామూళ్ల వ్యవహారం ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నప్పటికీ, వాటిని నిర్ధారించాల్సింది సంబంధిత దర్యాప్తు సంస్థలు, అధికారులు మాత్రమే. ఖమ్మం నగర ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని సంబంధిత శాఖలు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి, అనుమతులు లేకుండా నడుస్తున్న ఫంక్షన్ హాళ్లపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అధికారులు స్పందిస్తారా?“పసు” చట్టానికి చెక్ పెడతారా? లేక అక్రమాలకు అండగా నిలుస్తారా?

# సాంబశివరెడ్డి మరణం తీరని లోటు!

**⏭ తమ్మినేని , పోతినేని నివాళులు**



**టి మీడియా, ఆగస్టు 9, ఖమ్మం :** నిర్మల్ హృదయ్ స్కూల్ అధినేతగా ఆయన వేలాది మంది విద్యార్థుల జీవితాల్లో వెలుగు నింపారని, విద్యను సేవగా భావించి, క్రమశిక్షణతో, మంచి విలువలతో ఒక తరాన్ని తీర్చిదిద్దిన గొప్ప విద్యావేత్త అని జ్రూవీ కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేనివీరభద్రం, పి. సుదర్శన్ అన్నారు. ఆయన మరణ వార్త తెలిసిన వెంటనే వారి స్వగృహం కి వెళ్లి ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తమ్మినేని వీరభద్రం, సుదర్శన్ లుమాట్లాడుతూ....నిర్మల్ హృదయ్ స్కూల్ అధినేత వంగా సాంబశివరెడ్డిలి గుండెపోటుతో ఆకస్మికంగా మరణించడం పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఖమ్మంలో వారి భౌతికకాయానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించి వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. సాంబశివ రెడ్డి ఉత్తమ ఉపాధ్యాయుడిగా నిర్మల్ హృదయ్ స్కూల్ కరస్పాండెంట్ గా వేలాదిమంది విద్యార్థులకు విద్యా బోధన చేసి భావిభారత పౌరులుగా తీర్చిదిద్దారని విద్యారంగంలో వారి సేవలు మరువలేనివని..... అన్నారు.వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు కుటుంబ సభ్యులకు సంతాపం సానుభూతిని వ్యక్తం చేశారు.

# కాంగ్రెస్ నేత తోట సంజీవరెడ్డి మృతి



**⏭ మంత్రి పొంగులేటి సంతాపం**

**టి మీడియా, ఆగస్టు 9, ఏదులాపురం మున్సిపాలిటీ :** ఏదులాపురం మున్సిపాలిటీ 23వ వార్డు సత్యనారాయణపురానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు తోట సంజీవరెడ్డి (అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో) ఆదివారం మృతి చెందారు. ఆయన మరణం పట్ల తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సంతాపం తెలిపారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. సంజీవరెడ్డి మొదటినుంచీ తన వెంటే ఉంటూ, పార్టీ అభివృద్ధి కోసం నిబద్ధతతో పనిచేసిన ముఖ్య నేత అని మంత్రి కొనియాడారు. ప్రజాసేవలో ఎప్పుడూ ముందుండే సంజీవరెడ్డి మరణం పార్టీకి, స్థానికంగా తీరని లోటని పేర్కొంటూ... ఆయన కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే



**టీ మీడియా, ఆగస్టు 9 ,ఆత్మకూరు:** దేవరకద్ర నియోజకవర్గం మదనపురం మండలం కొత్తపల్లి గ్రామంలో నేడు కురుమూర్తి రాయ ఎత్తిపోతల పథకం నుండి స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులతో కలిసి మోటార్లు ఆన్ చేసి దుప్పల్లి, కొత్తపల్లి, అమ్మాపూర్, కురుమూర్తి గ్రామాలకు నీటిని విడుదల చేసిన దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూధన్ రెడ్డి అనంతరం ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఎగువ నుండి వస్తున్న వరద సమాచారం మేరకు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి దిగువకు నీటిని విడుదల చేస్తున్నామని అన్నారు, అందులో భాగంగా ఇప్పటికే కోయిల్ సాగర్, నెట్టెంపాడు, కల్వకుర్తి, భీమా ఫేజ్ 1, భీమా ఫేజ్ 2, ద్వారా నీటిని విడుదల చేసామని అన్నారు.మొత్తం 811 టీఎంసీల కృష్ణా జలాలను 512 టీఎంసీలు ఆంధ్రప్రదేశ్‌కు, తెలంగాణకు కేవలం 299 టీఎంసీలు మాత్రమే కేటాయించబడిన సమయంలో అధికారంలో ఉన్నది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు.కృష్ణా పరివాహక ప్రాంతంలో దాదాపు 67 శాతం తెలంగాణలో, ముఖ్యంగా పాలమూరు జిల్లాలో ఉన్నప్పటికీ రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై అప్పట్లో బిఆర్ఎస్ ప్రభుత్వం ఎందుకు పోరాడలేదని ప్రశ్నించారు.పోతిరెడ్డిపాడు విస్తరణ జరిగినప్పుడు, భారీగా నీళ్లు ఆంధ్రప్రదేశ్‌కు తరలిపోతున్న సమయంలో బీఆర్ఎస్ నాయకులు ఎందుకు స్పందించలేదని ఈ సందర్భంగా నిలదీశారు. తమ గత వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ప్రజాప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేస్తే, ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని పేర్కొన్నారు.రైతులకు ఎప్పుడు, ఎంత నీరు విడుదల చేయాలన్నది అధికారుల సాంకేతిక సూచనలు, నీటి లభ్యత, రైతుల అవసరాల ఆధారంగా ప్రభుత్వం నిర్ణయిస్తుందని స్పష్టం చేశారు.అనంతరం కొత్తపల్లి గ్రామంలో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన రు.

# అశ్వారావుపేటలో అభివృద్ధికి శ్రీకారం





- మంత్రి సీతక్క చేతుల మీదుగా శంకుస్థాపనలు
- మెరుగైన వసతులు లక్ష్యం ఎమ్మెల్యే జారె

**టీ మీడియా,ఆగస్టు 9,దమ్మపేట :**
దమ్మపేట, అశ్వారావుపేట మండలాల్లో అభివృద్ధి పనులకు ఆదివారం శ్రీకారం చుట్టారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ--శిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారె ఆదినారాయణతో కలిసి పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొని వివిధ పనులకు శంకుస్థాపనలు చేశారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం గిరిజన విద్యార్థులకు ఉపయోగపడేలా గిరిజన విద్యార్థుల కేంద్రం వద్ద రూ.25 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న కాంపౌండ్ వాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం దమ్మపేట మండలం మారప్పగూడెం గ్రామంలో సహాయక సంఘ మహిళల కమ్యూనిటీ భవన నిర్మాణ పనులతో పాటు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. పేద కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. రూ.కోటి వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణం నాచారం గ్రామంలో సుమారు రూ.కోటి అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి సీతక్క, ఎమ్మెల్యే జారె ఆదినారాయణ శంకుస్థాపన చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధితో ప్రజల రాకపోకలు మరింత సులభతరం అవుతాయని తెలిపారు. అనంతరం నాగుపల్లి గ్రామంలో అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. చిన్నారులకు మెరుగైన వసతులు, పౌష్టికాహారం అందించడంతో పాటు మహిళలు, పిల్లలకు అవసరమైన సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ దమ్మపేట మండలంలోని గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. మంత్రి సీతక్క సహకారంతో నియోజకవర్గంలో అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలకు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా అధికారులు, జిల్లా, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, సర్పంచులు, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# హక్కుల పరిరక్షణ దినంగా ఆదివాసీ దినోత్సవం



- అమర్లపూడి రాము

**టీ మీడియా ఆగస్టు 9 దమ్మపేట :**
దమ్మపేట మండలం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఆదివాసుల హక్కుల పరిరక్షణ దినంగా జరుపుకోవాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అమర్లపూడి రాము పిలుపునిచ్చారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా దమ్మపేట మండలంలోని లింగాలపల్లి, గురవాయిగూడెం, గండుగలపల్లి, దమ్మపేట గ్రామాల్లో సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్, అఖిలభారత ఐక్య రైతు సంఘం మండల కమిటీల ఆధ్వర్యంలో జెండా ఎగురవేసి, అమరవీరులకు జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాల్లో అమర్లపూడి రాము మాట్లాడుతూ.. ఒకప్పుడు అడవులను స్వేచ్ఛగా, సహజసిద్ధంగా అనుభవిస్తూ జీవించిన ఆదివాసుల హక్కులను నేటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని ఆరోపించారు. ఆదివాసుల జీవనాధారమైన అడవుల నుంచి వారిని దూరం చేసే విధానాలను ప్రభుత్వాలు తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

**మాస్ లైన్‌లోకి పలువురు చేరిక**

దమ్మపేటలో జరిగిన కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ మండల నాయకులు పండూరి వీరబాబు నాయకత్వంలో పాపారావు, సోమవరపు నారాయణ, పాల వెంకమ్మ, పాల సూరి తదితరులు పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి నాయకులు సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమాల్లో లింగాలపల్లి గ్రామ సర్పంచ్ ఊకే అప్పారావు, చేప ముత్యాలరావు, వాడే గిరి, కాక రాజు, సున్నం కృష్ణారావు, తమ రాముడు, కుంజ పాపారావు, తాటి ముత్యాలరావు, బండి ఆదినారాయణ, కేసరి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# సోనోవిజన్‌లో భారీ చోరీ

- గోడకు కన్నమేసి 150 ఆండ్రాయిడ్లు, 50 ఐఫోన్లు స్వాహా

**టి మీడియా ,ఆగస్టు 9 , తిరుపతి:**
ఆధ్యాత్మిక క్షేత్రం తిరుపతిలో అర్ధరాత్రి వేళ భారీ దొంగతనం కలకలం రేపింది. నగరంలోని ప్రముఖ ఎలక్ట్రానిక్ షోరూమ్‌ను టార్గెట్ చేసిన కొందరు దుండగులు క్షణాల వ్యవధిలో రూ.కోటిన్నర విలువైన స్మార్ట్‌ఫోన్లను కాజేశారు. సినిమా ఫక్కీలో గోడకు కన్నం వేసి లోపలికి చొరబడిన దుండగులు, బ్రాండెడ్ మొబైళ్లతో పరారయ్యారు.
తిరుపతిలోని సోనోవిజన్‌లో భారీ చోరీ జరిగింది. శుక్రవారం అర్ధరాత్రి కొందరు దుండగులు గోడకు కన్నమేసి లోపలికి ప్రవేశించి రూ.1.5 కోట్ల విలువైన 200 మొబైల్ ఫోన్లను కాజేశారు. ఈ ఘటన స్థానిక ఎయిర్ బైపాస్ రోడ్డులోని 'సోనోవిజన్' ఎలక్ట్రానిక్ షోరూమ్‌లో శుక్రవారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. శనివారం ఉదయం 10 గంటలకు షోరూమ్ మేనేజర్ గిరి రోజువారీలాగే షాపు తలుపులు తెరిచారు. లోపల షోకేస్‌లలోని మొబైల్ ఫోన్ల ఖాళీ బాక్సులు నేలపై పడి ఉండటం, కుడివైపు గోడకు పెద్ద రంధ్రం ఉండటాన్ని చూసి ఆయన వెంటనే పోలీసులకు సమాచారమిచ్చారు.

**తెల్లటి వస్త్రం చుట్టుకుని ఎంట్రీ**



సమాచారం అందుకున్న వెంటనే సీఐలు నరేష్, శివకుమార్‌రెడ్డి, అబ్బన్న, సత్యనారాయణలు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించింది. సీసీటీవీ ఫుటేజీని పరిశీలించగా షోరూమ్ కుడివైపు గోడకు రంధ్రం వేశాక అర్ధరాత్రి ఓ దుండగుడు చేతికి గ్లౌజులు తొడుక్కుని, శరీరంపై తెల్లటి వస్త్రం చుట్టుకుని గోడ రంధ్రం ద్వారా లోపలికి ప్రవేశించినట్లు పోలీసులు గుర్తించారు. లోపలికి రాగానే అతడు సీసీ కెమెరాల తీగలను కత్తిరించాడు. ఆ తర్వాత మరికొందరు దుండగులు లోపలికి చొరబడి 50 ఐఫోన్లు, 150 ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్లను కాజేశారు. వాటి విలువ సుమారు రూ.కోటిన్నర ఉంటుందని అంచనా.

**6 ప్రత్యేక బృందాలతో గాలింపు**

అదనపు ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు సోనోవిజన్ షోరూమ్?ను పరిశీలించి మీడియాతో మాట్లాడారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని, నిందితులను పట్టుకునేందుకు 6 ప్రత్యేక బృందాలను రంగంలోకి దించినట్లు వెల్లడించారు. ఈ దొంగతనానికి పాల్పడింది గుజరాత్ లేదా బిహార్‌కు చెందిన గ్యాంగ్? కావచ్చునని పోలీసులు అనుమానిస్తున్నారు. గతంలో విజయవాడ, ఖమ్మం పట్టణాల్లోనూ ఇదే తరహాలో చోరీలు జరిగాయని, వాటి ఆధారంగా దర్యాప్తును వేగవంతం చేశామని ఏఎస్పీ తెలిపారు.

# రోడ్డు ప్రమాదం కాదు, క్రిమినల్ చర్య

- ప్రియాంక ప్రమాద ఘటనపై జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్



**టి మీడియా ,ఆగస్టు 9 , తూర్పుగోదావరి :**
వైద్య విద్యార్థిని ప్రియాంకపై మద్యం మత్తులో యువకులు కారు ఎక్కించిన ఘటన దర్యాప్తులో విస్తుపోయే నిజాలు వెలుగుచూస్తున్నాయి. నిందితులు కారుతో ప్రియాంక ప్రయాణిస్తున్న స్కూటీని వరుసగా మూడుసార్లు ఢీకొట్టినట్లు తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ వెల్లడించారు. ఈ మేరకు సీసీ కెమెరా ఫుటేజీలో ఆధారాలు లభ్యమయ్యాయని తెలిపారు. మరోవైపు పోలీసుల దర్యాప్తుపై ప్రియాంక తండ్రి వెంకటేశ్ సంతృప్తి వ్యక్తం చేశారు. నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
ఈ ఘటనపై పలు కీలక విషయాలను ఎస్పీ నరసింహ కిషోర్ మీడియాకు వెల్లడించారు. "నిందితులు ఇద్దరూ మద్యం సేవించి ఓ మాల్‌కు వెళ్లారు. అక్కడ సినిమా హాల్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే సెక్యూరిటీ సిబ్బంది వారిని లోపలికి అనుమతించలేదు. దీంతో నిందితులు సెక్యూరిటీపై దాడికి దిగారు. అనంతరం సిబ్బంది వారిని పట్టుకునేందుకు ప్రయత్నించారు. అక్కడి నుంచి తప్పించుకునేందుకు నిందితులు కారులో వేగంగా పారిపోయే ప్రయత్నం చేశారు. ఆ క్రమంలోనే వేగంగా, నిర్లక్ష్యంగా కారు నడుపుతూ ప్రియాంక స్కూటీని ఢీకొట్టారు. వరుసగా మూడుసార్లు ఢీకొట్టడంతో ఆమె తీవ్రంగా గాయపడ్డారు." అని ఎస్పీ నరసింహ కిషోర్ వివరించారు. ఈ నెల 3న రాత్రి 10 గంటలకు ఆస్పత్రి నుంచి సమాచారం అందగానే, వైద్య విద్యార్థి ఉమేశ్ వాంగ్మూలం తీసుకుని కేసు నమోదు చేశామని చెప్పారు.
తీవ్రత దృష్ట్యా సెక్షన్లను మార్చి మరింత తీవ్రతరం ఈ ఘటనలో నిందితులు క్రూరంగా వ్యవహరించి, హిట్ అండ్ రన్ చేసి పరారయ్యారని ఎస్పీ నరసింహ కిషోర్ తెలిపారు. అరెస్టయిన ఇద్దరు నిందితులను ఇప్పటికే రిమాండ్‌కు పంపామన్నారు. వారు మద్యం సేవించి వాహనం నడిపినట్లు పక్కా ఆధారాలు సేకరించామని వెల్లడించారు. ఘటన తీవ్రత దృష్ట్యా సెక్షన్లను మార్చి కేసును మరింత తీవ్రతరం చేశామని పేర్కొన్నారు. కల్పబుల్ మర్డర్ అటెంప్ట్ (సెక్షన్ 110) కింద కేసు నమోదు చేశామని, పరిస్థితిని బట్టి మరిన్ని కఠిన సెక్షన్లు జత చేస్తామని స్పష్టం చేశారు. నిందితులను పోలీసు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ సోమవారం న్యాయస్థానంలో పిటిషన్ వేయనున్నట్లు ఎస్పీ తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నిష్పక్షపాతంగా విచారణ సాగుతోందని, ఈ కేసు దర్యాప్తులో పోలీసులపై ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేవని ఆయన స్పష్టం చేశారు.
పోలీసుల దర్యాప్తుపై నమ్మకం కుదిరింది తన కుమార్తె ప్రియాంకను ఢీకొట్టిన ఘటనలో పోలీసుల దర్యాప్తు పట్ల తండ్రి వెంకటేశ్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఆగస్టు 3 నుంచి ఇప్పటి వరకు పోలీసులు తీసుకున్న చర్యలు బాగున్నాయన్నారు. పోలీసుల దర్యాప్తు తీరుతో తమకు వారిపై పూర్తి నమ్మకం ఏర్పడిందని వెంకటేశ్ తెలిపారు. కఠిన శిక్షలు పడేలా మరిన్ని సెక్షన్లు జత చేయాలని తాను కోరగా, పోలీసులు సానుకూలంగా స్పందించారని చెప్పారు. తమకున్న అనుమానాలను సైతం పోలీసులు ఆధారాలతో సహా నివృత్తి చేశారని వెల్లడించారు. రాజకీయ ప్రభావానికి తావులేకుండా న్యాయం చేస్తామని పోలీసులు తమకు హామీ ఇచ్చారని పేర్కొన్నారు. మద్యం సేవించి మాల్‌లో గొడవపడిన నిందితులు ఆవేశంలో కారు నడిపారని వెంకటేశ్ ఆరోపించారు. వేగంగా వెళితే ముందున్న వ్యక్తులు చనిపోయే ప్రమాదం ఉందని తెలిసినా వారు అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరించారని మండిపడ్డారు. ఇది ప్రమాదం కాదని, ముమ్మాటికీ హత్య కేసేనని ఆయన స్పష్టం చేశారు. ఈ దారుణానికి పాల్పడిన ఆ మృగాళ్లకు అత్యంత కఠిన శిక్ష పడాలని డిమాండ్ చేశారు. తమ కుటుంబానికి ఇంతటి తీరని శోకం మిగిలినా, ప్రభుత్వం నుంచి స్పందన కరవైందని వెంకటేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, హోంమంత్రి కనీసం ఫోన్‌లోనైనా పరామర్శించలేదని ఆయన వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు తమకు ఎలాంటి ఆర్థిక సహకారం అందలేదన్నారు. ఆస్పత్రి ఖర్చులన్నీ తామే సొంతంగా భరిస్తున్నామని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ కుటుంబం పట్ల మానవత్వం చూపాలని, తమకు న్యాయం చేయాలని వెంకటేశ్ విజ్ఞప్తి చేశారు.

# నేను ప్రాణాలు కోల్పోయేదాన్ని

- కాన్వాయ్ దాడిపై మమతా బెనర్జీ

**టి మీడియా ,ఆగస్టు 9 , ఢిల్లీ బ్యూరో :**
పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ కాన్వాయ్‌పై దాడి జరిగింది. నిరసనకారులు ఆమె వాహనంపై రాళ్లు, చెప్పులు విసరడంతో పాటు బురద చల్లారు. అయితే ఈ దాడిలో తన ప్రాణాలు పోయేవని మమతా బెనర్జీ ఆరోపించారు. బెంగాల్‌లోని ఉత్తర 24 పరగణాల జిల్లాలో ఈ సంఘటన జరిగింది. పోలీస్ కస్టడీలో మరణించిన టీఎంసీ కార్యకర్త బిర్జు కెయోట్ కుటుంబాన్ని కలిసేందుకు మమతా బెనర్జీ శనివారం హలిసహర్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా అక్కడ ఆమెకు నిరసన సెగ ఎదురైంది. కొంతమంది వ్యక్తులు మమతా బెనర్జీ వాహనాన్ని చుట్టుముట్టారు. ఇటుకలు, రాళ్లతో ఆ వాహనంపై దాడి చేశారు. దానిపై బురద కూడా చల్లారు. 'దొంగను తరిమికొట్టండి' అన్న నినాదాలు కూడా వినిపించాయి.
కాగా, తన వాహనంపై దాడి తర్వాత మమతా





బెనర్జీ మీడియాతో మాట్లాడారు. ఈ దాడిలో తాను ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఎదురైందని ఆమె ఆరోపించారు. తనపై ఇటుకలు, రాళ్ల పడి ఉంటే ప్రాణాలు కోల్పోయే దానినని అన్నారు. 'పోలీసుల ముందే బయటి నుంచి వచ్చిన సంఘవిద్రోహులు నా కారుపై రాళ్లు విసిరారు. నా కారు కిటికీలు మూసి ఉండకపోతే, ఆ ధాటికి నా తల పగిలిపోయేది. నేను చనిపోయి ఉండేదాన్ని. ఇంతటి దాడిని నేను ఎప్పుడూ ఎదుర్కోలేదు. మమ్మల్ని కాపాడటానికి పోలీసులు ఏమీ చేయలేదు. వాళ్లు కేవలం బీజేపీకి మాత్రమే రక్షణ కల్పిస్తారు' అని ఆమె ఆరోపించారు. మమతా బెనర్జీ వెంట ఉన్న లోక్‌సభ ఎంపీ కళ్యాణ్ బెనర్జీ, రాజ్యసభ ఎంపీ డోలా సేన్ కూడా బీజేపీ ప్రభుత్వంపై తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.

# రోడ్డు ప్రమాదములో వ్యక్తి మృతి

**టీ మీడియా ఆగస్టు 9 కూసుమంచి :**
ద్విచక్ర వాహనంపై వెళుతున్న వ్యక్తిని ఎదురుగా వస్తున్న ఓమ్ని వ్యాన్ ఢీకొట్టడంతో , ఆదివారం ఆ వ్యక్తి మృతి చెందాడు. కూసుమంచి మండలంలోని భగత్ వీడు తండాకి చెందిన మాలోతు సుక్య ( 32 ) ద్విచక్ర వాహనంతో మండలంలోని గంగబండ తండాకు వెళ్తుండగా మార్గమధ్య హత్య తండా సమీప ఖమ్మం సూర్యాపేట నేషనల్ హైవే రోడ్డుపై ఎదురుగా వెళ్తున్న ఓమిని వేణు ఢీ కొట్టిన సంఘటన ఆదివారం జరిగింది. ఈ ప్రమాదంలో సుక్యా తలకి బలమైన గాయాలు కాగా,ఆసుపత్రికి తరలించారు. అప్పటికే సుక్య మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి కుమారుడు మాలోతు కృష్ణ ఫిర్యాదు మేరకు కూసుమంచి ఎస్సై నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# మాజీ ఎంపీ నామ సంతాపం

**టి మీడియా ,ఆగస్టు 9 , ఖమ్మం:**
నగర వాస్తవ్యులు, నిర్మల్ హృదయ్ స్కూల్ అధినేత వంగా సాంబశివారెడ్డి ఆదివారం ఉదయం మరణించిన విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సాంబశివారెడ్డి కుమారుడు వంగా సుధాకర్ రెడ్డితో నామ ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు. ఈ దుఃఖ సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని నామ సూచించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ వారి కుటుంబ సభ్యులకు మాజీ ఎంపీ నామ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

